క్లుప్తంగా

భూ రీసర్వేపై అవగాహన



రీసర్వేపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్

చిట్టమూరు: మండల పరిధిలోని నార్తువరత్తూరు గ్రామంలో తహసీల్దార్ కాయల సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం భూ రీసర్వేపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గ్రామస్తులతో కలిసి రెవెన్యూ సిబ్బంది ర్యాలీ చేశారు. గ్రామంలో ఈనెల 15 నుంచి రీసర్వే ప్రారంభమవుతుందన్నారు. గ్రామ రెవెన్యూ పరిధిలో 570 ఎకరాల సర్వే, గ్రామ హద్దులు, కాలువలు, వాగులు, వంకలపై సర్వే నిర్వహిస్తామన్నారు. ఇందుకుగాను గ్రామస్తుల ఫోన్ నంబర్లతో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి సర్వే వివరాలు తెలియజేస్తామని ఆయన తెలిపారు. ఇందుకు గ్రామస్తులు సహకరించాలని కోరారు. రీసర్వే డీటీ నిరంజన్, వీఆర్వో శివయ్య, సునయన పాల్గొన్నారు.

వేడుకగా సీతారాముల కల్యాణం



ఆలయంలో కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

ఓజిలి: మండలంలోని పెదపరియ రాచపాళెం గ్రామంలోని శ్రీరాముని ఆలయంలో సీతారాముల కల్యాణోత్సవాన్ని మంగళవారం కనులపండువగా నిర్వహించారు. శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా మూడో రోజు స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి, మేళతాళాలతో వైభవంగా కల్యాణోత్సవం నిర్వహించారు. వసంతోత్సవం నిర్వహించి, యువకులు ఉట్టి కొట్టారు. మధ్యాహ్నం వైఎస్సార్‌సీపీ నాయకుడు, ఉప సర్పంచ్ దొమ్మరాజు వెంకటరమణరాజు, దామోదర్‌రాజు, దశరథరాజు ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం పురవీధుల్లో స్వామి, అమ్మవార్ల గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న సునీల్

కలువాయి(సైదాపురం): కలువాయి మండలం ఉపాధి పథకం ఏపీఓగా సునీల్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఏఎస్‌పేట మండలం నుంచి కలువాయికి బదిలీపై వచ్చారు. అలాగే టెక్నికల్ అసిస్టెంట్‌గా నరసింహారెడ్డి మర్రిపాడు మండలం నుంచి బదిలీపై కలువాయికి వచ్చారు.

ఉపాధి కూలీలకు మజ్జిగ



కూలీలకు మజ్జిగ పంపిణీ చేస్తున్న ఏపీఓ

చిల్లకూరు: ఉపాధి హామీ కింద పని చేసే కూలీలకు వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని దాతల సహకారంతో మజ్జిగ పంపిణీ చేస్తున్నట్లు ఏపీఓ గిరిబాబు తెలిపారు. మండలంలోని 30 పంచాయతీల్లో జరుగుతున్న ఉపాధి పనుల వద్ద కూలీలకు దాతలు ముందుకు వస్తే మజ్జిగ అందించే ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. క్షేత్ర సహాయకులు, దాతలు పాల్గొన్నారు.

డ్రైవరన్నా.. మేలుకో!

- పెళ్లకూరు పోలీసుల వినూత్న కార్యక్రమం



డ్రైవర్లకు వాటర్ బాటిల్ ఇచ్చి మొహం కడిగిస్తున్న పోలీసులు

పెళ్లకూరు: నాయుడుపేట-పూతలపట్టు జాతీయ రహదారిపై వెళ్లే వాహన చోదకులకు నిద్ర మత్తు వదిలేలా స్థానిక ఎస్ఐ కె.నాగరాజు ఆధ్వర్యంలో పోలీసులు వినూత్న కార్యక్రమం చేపట్టారు. మంగళవారం తెల్లవారుజామున ఎస్ఐ తన సిబ్బందితో కలిసి జాతీయ రహదారిపై వెళ్లే వాహనాలను నిలిపి డ్రైవర్లకు నీళ్ల బాటిళ్లు, అందించి ముఖం కడుక్కోమని సూచనలిచ్చారు. నిద్రమత్తుతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, చల్లటి నీటితో ముఖం కడిగిస్తూ ప్రమాదాల నియంత్రణకు కృషి చేస్తున్నట్టు ఈసందర్భంగా ఎస్ఐ నాగరాజు తెలిపారు. కార్యక్రమంలో పెళ్లకూరు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

తల్లంపాడు జెడ్పీ పాఠశాల



దుస్థితిలో మరుగుదొడ్లు



అసౌకర్యాల బడి

- సమస్యల నిలయంగా తల్లంపాడు జెడ్పీ పాఠశాల
- శిథిలావస్థలో మరుగుదొడ్లు, ప్రహరీ
- ఆగిన నాడు-నేడు పనులు

దొరవారిసత్రం: ముందు చూస్తే నుయ్యి..వెనక చూస్తే గొయ్యి అన్న చందాన తల్లంపాడు గ్రామ పరిధిలోని జిల్లా పరిషత్ పాఠశాల ఆనుకునే జాతీయ రహదారి, వెనుక నెర్రికాలువ ఉంది. దీంతో విద్యార్థుల చదువులు ప్రమాదపు అంచున కొనసాగుతున్నాయి. పాఠశాల ప్రహరీ గోడ శిథిలాస్థకు చేరుకొని దెబ్బతింది. అదేవిధంగా సరైన వసతులు లేకపోవడంతో విద్యార్థులు పలు సమస్యలతో ఇబ్బందులు పడుతూ విద్యను అభ్యసిస్తున్నారు.

మరుగు ఇక్కట్లు

తల్లంపాడు జెడ్పీ పాఠశాలలో బాలికలు, బాలుర సౌకర్యార్థం మరుగుదొడ్లు ఉన్నా అవి శిథిలావస్థకు చేరాయి. మరుగుదొడ్ల తలుపులు దెబ్బతిని, అపరిశుభ్ర వాతావరణ నడుమ అత్యంత దారుణంగా దర్శనమిస్తున్నాయి. పాములకు నిలయంగా మారాయి. విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ పాఠశాలకు వెళుతున్నారు. గత ప్రభుత్వంలో మనబడి నాడు-నేడు కింద 2022-23 తల్లంపాడు జెడ్పీ పాఠశాలకు వివిధ మరమ్మతులకు, నిర్మాణాలకు రూ.69లక్షలు మంజూరు చేశారు. విడుదలైన నిధులతో అప్పటి రన్నింగ్ వాటర్‌తో మరుగుదొడ్లు, కిచెన్ షెడ్, పాఠశాలలో మేజర్, మైనర్ మరమ్మతులు, ప్రహరీ నిర్మాణం, విద్యుత్ మరమ్మతులు, విద్యార్థుల సౌకర్యార్థం ఫర్నిచర్, ఇతర అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. వివిధ పనులకు అప్పటిలోనే 50శాతం వరకు నిధులు చెల్లించారు. ఇంతలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. దీంతో మరుగుదొడ్లు, కిచెన్ షెడ్, ఇతర పనులు అసంపూర్తిగానే మిగిలిపోయి పనులు మొదులు కాలేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు నాడు-నేడు పనులు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.



ప్రహరీ లేక వేసిన ముళ్లకంపలు



పూర్తికాని కిచెన్ షెడ్



అసంపూర్తిగా నాడు నేడు మరుగుదొడ్లు

సమష్టి కృషితో విజయం తథ్యం



పార్టీ శ్రేణులతో మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

- అవిశ్వాస తీర్మానంపై నేదురుమల్లి

వెంకటగిరి(సైదాపురం): మున్సిపాలిటీలో బుధవారం జరగనున్న మున్సిపల్ అవిశ్వాస తీర్మానంలో వైఎస్సార్‌సీపీ విజయం తథ్యమని వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని నేదురుమల్లి కార్యాలయంలో మంగళవారం వైఎస్సార్‌సీపీ శ్రేణులతో పలు అంశాలపై చర్చించారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ల సమష్టి కృషితో మళ్లీ వైఎస్సార్‌సీపీ జెండా ఎగురనున్నట్లు స్పష్టం చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియనే కొనసాగనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి కౌన్సిలర్లకు విప్‌ను కూడా జారీ చేసినట్లు చెప్పారు. వైఎస్సార్‌సీపీ నేతలను, కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం, అధికారులు వ్యవహరిస్తున్నారన్నారు. వారికి బుద్ధి చెప్పే రోజులు తొందరలోనే ఉన్నాయని తెలిపారు. బుధవారం జరగనున్న మున్సిపల్ అవిశ్వాసంలో వైఎస్సార్‌సీపీ సత్తా ఏమిటో చూపిస్తామని చెప్పారు. ఇదే స్ఫూర్తితో వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణులు సమష్టిగా కృషిచేసి జగనన్నను మళ్లీ సీఎంగా చేసుకునేందుకు కంకణం కట్టుకున్నట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ పులి ప్రసాద్‌రెడ్డి, పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ నక్కా వెంకటేశ్వరరావు, జిల్లా సంయుక్త సహాయకార్యదర్శి చిట్టేటి హరికృష్ణ, నేతలు మల్లిరెడ్డి, సతీష్, తిరుమల, దశరథరామిరెడ్డి పాల్గొన్నారు.

వాడీవేడిగా మండల మీట్



సమావేశంలో ఎంపీపీ, అధికారులు

సైదాపురం: సైదాపురం మండల మీట్ వాడీవేడిగా సాగింది. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ పలుగోటి పెంచలమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీడీఓ పురుషోత్తం శివకుమార్ నిర్వహించారు. సమావేశంలో తరచూ అధికారులు సమావేశాలకు డుమ్మాకొడుతుండడంతో ఎంపీటీసీ సభ్యులు అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలంటూ ధ్వజమెత్తారు. తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరిస్తున్నట్లు ఎంపీడీఓ శివకుమార్ అన్నారు. కలిచేడు సర్పంచ్ మాట్లాడుతూ కలిచేడు పరిసర ప్రాంతాల్లో అక్రమ మైనింగ్ జరుగుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడంపై మండిపడ్డారు. అధికారులు మండల సమావేశాలకు డుమ్మా కొట్టడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా మండలంలో తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన వివరించారు. ఏపీఎం చంద్రశేఖర్, జెడ్పీటీసీ సభ్యుడు చిత్తలూరు పోలయ్య, వైస్ ఎంపీపీలు తిరకాల భాస్కర్,ఈశ్వరమ్మ, పాలూరు ఎంపీటీసీ సభ్యుడు ఈశ్వరరాజు, అనంతమడుగు వెంకటరమణయ్య, చాగణం ఎంపీటీసీ సభ్యురాలు సుమతి, సైదాపురం ఎంపీటీసీ సభ్యురాలు శిరసం బేటి పద్మమ్మ, రామసాగరం ఎంపీటీసీ సభ్యుడు నాగరాజు, మర్లపూడి ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాసులు, ఏఈలు వెంకటేశ్వర్లు, మనోజ్, సీడీపీఓ, వైద్యాధికారులు, ఎంఈఓ దయాకర్ పాల్గొన్నారు.

వాకాడు డిపో తనిఖీ



సిబ్బందితో మాట్లాడుతున్న డీపీటీఓ నరసింహులు

వాకాడు: వాకాడు ఆర్టీసీ డిపోను డీపీటీఓ నరసింహులు మంగళవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన గ్యారేజ్‌లోని పలు విభాగాలను పరిశీలించారు. అలాగే రూట్ చార్ట్‌ను పరిశీలించారు. ఆయన మాట్లా డుతూ ప్రతి ఉద్యోగి ఈహెచ్‌ఎస్, ఈపీఎఎస్ పెన్షన్లపై అవగాహన కలిగి ఉండాలన్నారు. చిట్టమూరు మండలం మల్లాం గ్రా మంలో వెలసిన సుబ్రమణ్యం స్వామి ఆలయం, చిల్లకూరు మండలం తూర్పు కనుపూరు గ్రామంలోని ముత్యాలమ్మ ఆలయానికి ప్రత్యేక బస్సులు నడపాలని ఆలయాల ధర్మకర్తలు కోరగా పరిశీలిస్తామని ఆయన తెలిపారు. వాకాడు డిపోకు 13 కొత్త బస్సు లు వచ్చాయని, వాటిని సక్రమంగా తిప్పేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. డిపో మేనేజర్ పెంచలయ్య, సిబ్బంది ఉన్నారు.

నేడు వెంకటగిరిలో నేదురుమల్లి



నేదురుమల్లి

వెంకటగిరి రూరల్: వైఎస్సార్‌సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి బుధవారం వెంకటగిరిలో నేదురుమల్లి నివాసంలో కార్యర్తలకు, నాయకులకు అందుబాటులో ఉండనున్నట్లు నేదురుమల్లి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. బుధవారం తేదీన జరగనున్న అవిశ్వాస తీర్మానంపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు పేర్కొన్నారు.

గ్యాస్, పెట్రోల్ ధరలు తగ్గించాలి



నాయుడుపేట సీఐటీయూ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న నేతలు

నాయుడుపేట టౌన్: గ్యాస్, పెట్రో ధరలు పెంచడంపై మంగళవారం సీపీఎం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. సీపీఎం పార్టీ నాయకులు పట్టణంలోని సీఐటీయూ కార్యాలయం ఆవరణలో కట్టెల పొయ్యి వెలిగించి నిరసన తెలిపి ఆందోళనలు చేపట్టారు. సీపీఎం నాయకుడు ముకుంద మాట్లాడుతూ ఇష్టారాజ్యంగా ధరలు పెంచడం దారుణమని విమర్శించారు. రజక సంఘం నాయకులు అక్కరపాక పుట్టయ్య, సీఐటీయూ నాయకులు వీరయ్య, అంకయ్య, గోపి, వెంకయ్య, చిన్నమ్మ, విజయమ్మ పాల్గొన్నారు.

కండలేరులో 47.530 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం నాటికి 47.530 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1320, పిన్నేరుకాలువకు 5, లోలెవల్ కాలువకు 50, హైలెవల్ కాలువకు 30, మొదటి బ్రాంచ్ కాలువకు 10 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

రుణాలు సద్వినియోగం చేసుకోండి



అధికారులతో మాట్లాడుతున్న ఏపీడీ ప్రభావతి

దొరవారిసత్రం: పొదుపు సంఘాల్లోని మహిళలు తీసుకున్న రుణాలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని డీఆర్‌డీఏ అడిషనల్ పీడీ ప్రభావతి అన్నారు. మంగళవారం ఆమె స్థానిక వెలుగు కార్యాలయాన్ని సందర్శించి పలు రికార్డుల నిర్వహణ, సిబ్బంది పని తీరుపై ఆరా తీశారు. అనంతరం ఏకొల్లు గ్రామంలో స్వయం సహాయక సంఘం సభ్యులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఎం మునిరాజ, సీసీలు మణెమ్మ, ధనమ్మ, వీఓఏలు పాల్గొన్నారు.

విద్యుత్ మోటార్ వైర్ల చోరీ

చిట్టమూరు: మండలంలోని ఎడగారు వరి సాగు చేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్న తరుణంలో పొలాల్లో విద్యుత్ మోటార్ల కేబుల్ వైర్లు చోరీకు గురవుతున్నాయి. ఈక్రమంలో ఆరూరు గ్రామానికి చెందిన దేవారెడ్డి పట్టాభిరెడ్డి అనే రైతుకు చెందిన మోటార్ విద్యుత్ కేబుల్ వైరు మంగళవారం తెల్లవారుజామున దుండగులు చోరీ చేశారు. పోలీసులు పొలాల్లో ఉన్న విద్యుత్ మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లపై నిఘా పెట్టాలని రైతులు కోరుతున్నారు.

వక్ఫ్ సవరణ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలి



నూర్ మసీద్ వద్ద ఆందోళన చేస్తున్న ముస్లింలు

చిల్లకూరు: కేంద్ర ప్రభుత్వం సవరించిన వక్ఫ్ చట్టాన్ని వెనక్కి తీసుకునేలా రాష్ట్రంలోని కూటమి నాయకులు కూడా కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి మగ్దూమ్ మొహిద్దీన్ డిమాండ్ చేశారు. గూడూరు పట్టణంలోని నూర్ మసీద్ వద్ద మంగళవారం ముస్లింలతో కలిసి ఆయన ఆందోళన చేశారు. ఆయన మాట్లాడుతూ కక్షపూరితమైన చట్టాలను తీసుకుని వస్తున్న కూటమి నాయకులకు భవిష్యత్తులో ముస్లింలు తమ సత్తాను చూపుతారని అన్నారు. వక్ఫ్ భూములను కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేసేందుకే ఇలాంటి కుట్రలకు పాల్పడుతున్నారని దుయ్య బట్టారు.ముస్లింలు అందరూ ఒక్క తాటిపైకి వచ్చి దేశ వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. గౌస్‌బాషా, షేక్ మహబూబ్‌బాషా, సయ్యద్ సలీం, సందాని బాషా, షేక్ అబ్దుల్లా, బక్షు, బాబు, జునైద్ పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడి ఎంపిక

కోట: బీజేపీ మండల కమిటీ సమావేశం మంగళవారం కోటలో జరిగింది. సమావేశంలో నూతన మండల అధ్యక్షుడిగా పి.సురేష్‌ను నియమించినట్లు బీజేపీ ఎన్నికల అధికారి శ్రీహరి తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషిచేస్తానని సురేష్ తెలిపారు. పార్టీ నేతలు గిరిధర్‌రెడ్డి, కోటేశ్వరరావు, క్రిష్ణయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పురమిత్ర డౌన్‌లోడ్ చేసుకోండి

చిల్లకూరు: గూడూరు మున్సిపల్ పరిధిలోని ప్రజలు పురమిత్ర యాప్‌ను సెల్‌ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకోవాలని మంగళవారం మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. పురమిత్ర యాప్ ద్వారా ప్రజలు మౌలిక వసతులపై వచ్చిన సమస్యలపై ఫిర్యాదు చేయడంతో పాటు చెల్లింపులు, ట్రేడ్ లైసెన్స్‌లు, పబ్లిసిటీ టాక్స్ చెల్లింపులు, ఖాళీ స్థలాల పన్నులు, మంచినీటి కొళాయిలు పొందవచ్చని పేర్కొన్నారు. అలాగే సమస్యలను యాప్‌లో ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. మొబైల్‌లో ప్లే స్టోర్‌లో యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు.

ఉద్యమాలు మరింత ఉధృతం చేస్తాం

శ్రీకాళహస్తి : పుచ్చలపల్లి సుందరయ్య స్ఫూర్తితో భవిష్యత్తు ఉద్యమ కార్యక్రమాలను ఉధృతం చేస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు అంగేరి పుల్లయ్య అన్నారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో మంగళవారం సీపీఎం ప్రాంతీయ కమిటీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మే 1న మే డే, సుందరయ్య జయంతి, 19న సుందరయ్య వర్ధంతి నిర్వహణకు ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. మే 8, 9, 10న తిరుపతి వేమన విజ్ఞాన కేంద్రం వేదికగా సీపీఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు నిర్వహించనున్నట్లు స్పష్టం చేశారు. ఆరు నెలలు-ఆరు కమిటీల నినాదంతో పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేయనున్నట్లు తెలిపారు. అలాగే సీపీఎం రాష్ట్ర కమిటీ సమావేశాల కరపత్రాలను ఆవిష్కరించారు. పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు పాల్గొన్నాయి.

నిర్వాసితులకు న్యాయం చేస్తాం



కొత్తపేట వద్ద ఇళ్లను పరిశీలిస్తున్న ఆర్డీఓ

ఓజిలి: విశాఖపట్నం- చెన్నై కోస్టల్ కారిడార్ రోడ్డు విస్తరణలో భాగంగా భూములు, ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులకు న్యాయం చేస్తామని సూళ్లూరుపేట ఆర్డీఓ ఈ.కిరణ్మయి హామీ ఇచ్చారు. మండలంలోని పున్నేపల్లి, గ్రద్దగుంట, కొత్తపేట గ్రామాల్లో రోడ్డు విస్తరణ పనులకు సంబంధించి భూములు, ఇళ్లను మంగళవారం పరిశీలించారు. ఆర్డీఓ మాట్లాడుతూ విశాఖపట్నం-చెన్నై పారిశ్రామిక ప్రాంత అభివృద్ధిలో భాగంగా నాయుడుపేట మండలం తిమ్మాజీకండ్రిగ నుంచి నాయుడుపేట వరకు రోడ్డు విస్తరణకు ప్రతిపాదనలు పంపించామన్నారు. రోడ్డు విస్తరణలో ఓజిలి మండలంలో గ్రద్దగుంట, పున్నేపల్లి, కొత్తపేట, నాయుడుపేట మండలంలో తిమ్మాజికండ్రిగ, అయ్యప్పరెడ్డిపాళెం, వెంగమాంబాపురం, పండ్లూరు గ్రామాల్లో మొత్తం 68.16 ఎకరాల భూమి, ఓజిలి మండలం లక్ష్మీపురంలో 7 ఇళ్లు, పాపిరెడ్డికండ్రిక 2, కొత్తపేటలో 20 ఇళ్లను గ్రామస్తులు కోల్పోతున్నారని తెలిపారు. ఈ రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోయిన ప్రతి కుటుంబానికి నూతన భూసేకరణ చట్టం 2013 ప్రకారం నష్టపరిహారం చెల్లిస్తామన్నారు. ఓజిలి, నాయుడుపేట తహసీల్దార్లు పద్మావతి, రాజేంద్ర, ఆర్‌అండ్‌బీ డీఈఈ పరమేశ్వరీ, ఏఈ చిన్నరాయుడు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో ప్రవేశిస్తే చర్యలు



ఆక్రమిత భూమిలో హెచ్చరిక బోర్డుల ఏర్పాటు

ఓజిలి: ప్రభుత్వ భూములు ఆక్రమించి సాగు చేస్తే వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ పద్మావతి పేర్కొన్నారు. మండలంలోని భట్లకనుపూరు గ్రామంలో సర్వే నంబర్ 103లో ఆక్రమణకు గురైన భూమిని మంగళవారం రెవెన్యూ సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో సర్వే నంబర్ 103లో 196 ఎకరాలు అడవి పోరంబోకు భూములు ఉన్నాయన్నారు. ఈ భూమిని రెండు రోజులు క్రితం గ్రామానికి చెందిన కొంత మంది ఆక్రమించి సాగుచేస్తున్నారని ఫిర్యాదు అందడంతో ఈ మేరకు ఆర్ఐ విజయ్‌కుమార్, వీఆర్‌ఓ ఢిల్లయ్య ఆక్రమిత భూమిని పరిశీలించి బోర్డులు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఆక్రమితదారులు రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన బోర్డులను తొలగించి మళ్లీ ఆక్రమించేందుకు ప్రయత్నించారని తెలిపారు. దీంతో వివాదాస్పద భూమిలో మరోసారి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ భూమిలో ఎవరు ప్రవేశించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అక్రమంగా మట్టి తరలింపు



గునపాడు చెరువులో ట్రాక్టర్లలో తరలిస్తున్న మట్టి

చిట్టమూరు: మండల పరిధిలోని గునపాడు చెరువులో గత వారం రోజులుగా కూటమి నేతలు అక్రమంగా మట్టి తరలిస్తున్నారు. అయితే ఇరిగేషన్ అధికారులు మాత్రం ఇంత తంతు జరుగుతున్నా చెరువు వైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. దీంతో కూటమి నాయకులు చెరువులో జేసీబీలు పెట్టి పట్టపగలు ట్రాక్టర్లతో లేఔట్‌లకు తరలించి లక్షలు సొమ్ము చేసుకుంటున్నారని ఆయకట్టు రైతులు ఆరోపిస్తున్నారు. చెరువులో మట్టిని ఇటుకల బట్టీ యజమానులకు అమ్ముకుని జేబులు నింపుకుంటున్నట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. చెరువులో మట్టిని చెరువు తూముల కంటే లోతుకు ఎత్తివేయడంతో చెరువులోని సాగు నీరు పొలాలకు పారే పరిస్థితి లేదని ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు స్పందించి మట్టి తరలింపును అడ్డుకోవాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

ప్రమాదకరంగా కాళంగి వంతెన



చెంగాళమ్మ పరమేశ్వరి దేవస్థానం సమీపంలో శిథిలావస్థలో కాళంగి వంతెన

సూళ్లూరుపేట: పట్టణంలోని చెంగాళమ్మ ఆలయం సమీపంలో 125 సంవత్సరాల ముందు బ్రిటీష్ వారు నిర్మించిన కాళంగి నదిపై ఉన్న వంతెన రెండువైపులా మొక్కల్లు మొలిచిపోయి ప్రమాదకరస్థితికి చేరుకుంటోంది. వంతెనకు రెండువైపులా మర్రిచెట్టు, జువ్విచెట్లు వేర్లు పెట్టి పెద్దవి అవుతుండడంతో పగుళ్లు వచ్చి ప్రమాదకరంగా తయారైంది. దీనికి తోడు రెండు మూడేళ్ల నుంచి మాంబట్టు సెజ్, శ్రీసిటీ సెజ్‌లోని అనేక కంపెనీలకు చెందిన 300 బస్సులు పైగా పట్టణంలోకి రాకపోకలు సాగిస్తున్నాయి. వంతెన పరిస్థితి బాగలేదని పోలీసులు ముందు జాగ్రత్తలు తీసుకుని బస్సులను వంతెన మీద రాకపోకలను నిషేధించారు. అయినా సరే కొంతమంది పోలీసుల కళ్లుగప్పి వంతెన మీదే రాకపోకలు సాగిస్తున్నారు. ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితులు ఏర్పడి ఉన్నాయి. ఆర్‌అండ్‌బీ అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో ఎంతో పురాతనమైన వంతెనకు గండం తప్పేలా లేదు. గతంలో వంతెన కుంగిందని కొద్దిరోజుల పాటు మరమ్మతులు చేసిన సంఘటన కూడా చోటుచేసుకుంది. చెట్లు బాగా పెద్దవై పోయి వేర్లు వదలడంతో వంతెనకు అక్కడక్కడ పగుళ్లు కనిపిస్తున్నాయి. ఈ వంతెనకు ఏదైనా ప్రమాదం జరిగితే మూడు కిలో మీటర్లు చుట్టుకుని పట్టణంలోకి రావాల్సి ఉంటుంది. గతంలో కాంగ్రెస్, టీడీపీ పాలకులు ఈ వంతెన నిర్మించాలని అనేకసార్లు హామీ లిచ్చి గాలికి వదిలేశారు. గత ప్రభుత్వంలో ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య దీనిపై దృష్టి సారించి వంతెన నిర్మాణంతోపాటు నదిలో నీళ్లు నిల్వ వుండేందుకు చిన్నపాటి చెక్‌డ్యాం లాంటిది కూడా నిర్మించాలని ప్రణాళిక సిద్ధం చేయడానికి ప్రయత్నాలు చేసి రూ.38 కోట్లు నిధులు మంజూరు చేయించారు. నిధులు మంజూరు చేసిన రెండు నెలల్లోనే ఎన్నికల కోడ్ రావడంతో పనులు ఆగిపోయాయి. కూటమి ప్రభుత్వం దీనిపై దృష్టి సారించి కొత్త వంతెన నిర్మించాలని వాహనచోదకులు, పట్టణ ప్రజలు కోరుతున్నారు.